ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు

5

బుధవారం 24 జూలై 2024



ఓర్వకల్లుకు పారిశ్రామిక వైభవం

కర్నూలు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ 2024-25 రాష్ట్రానికి వరాల జల్లు కురిపించింది. ఓర్వకల్లు పారిశ్రామిక వైభవంతో వెలిగిపోయేలా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నిధులు కేటాయించారు. మంగళవారం పార్లమెంట్‌లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని కానుకగా ఇచ్చారు. గత జగన్ ప్రభుత్వంలో రాష్ట్రానికి కొత్త ప్రాజెక్టులు రాకపోగా ఉన్నవి కూడా వెనక్కిపోయాయి. బడ్జెట్ కేటాయింపులు జరగలేదు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి తీవ్రంగా నష్టపోయింది. వివిధ ప్రభుత్వ రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ తరుణంలో కొలువుదీరిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వ సారథి సీఎం చంద్రబాబు పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్‌షా సహా పలువురు మంత్రులను కలసి చర్చించారు. దీని ఫలితమే నిర్మలా సీతారామన్ బడ్జెట్ పద్దుల్లో రాష్ట్రానికి ప్రాధాన్యత దక్కింది. అమరావతి, పోలవరం ప్రాజెక్టు సహా ఓర్వకల్లును పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నీరు, విద్యుత్, రోడ్లు, రైల్వేల వంటి మౌలిక వసతులకు నిధులు ఇస్తామన్నారు.

పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట

- టీజీ భరత్, పరిశ్రమల శాఖ మంత్రి



రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ కేటాయింపులు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం వల్ల రాష్ట్రం పారిశ్రామికంగా పాతికేళ్లు వెనక్కి వెళ్లింది. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు అగ్రస్థానం కల్పించింది. అదే క్రమంలో ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక వాడల్లో మౌలిక సదుపాయాల నిధులు ఇవ్వడం అభినందనీయం. కేంద్ర నిధులు పూర్తిగా సద్వినియోగం చేసుకుని పరిశ్రమల శాఖ మంత్రిగా ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్‌ను అభివృద్ధి చేస్తా. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేంద్రం పలు ప్రాజెక్టులు ఇవ్వాలి. అప్పుడే ఏపీ గణనీయమైన పురోగతి సాధిస్తుంది.

ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధికి బీజం

వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక గ్రాంట్లు ఇవ్వాలని రాష్ట్ర విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. 2014 తరువాత మూడేళ్లు కేంద్రం దాదాపు రూ.300 కోట్లు ఇచ్చింది. ఆ తరువాత ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఆ నిధుల కోసం కనీస ప్రయత్నం చేసినట్లు కూడా కనిపించలేదు. దీంతో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు పలుమార్లు ఢిల్లీ వెళ్లి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే కేంద్ర సహకారం కావాలని ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీని ఫలితంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక గ్రాంటు ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. దీంతో వెనుకబడిన ప్రాంతాల ప్రగతిపై ఆశలు చిగురించాయి.



చంద్రబాబు హయాంలో నిర్మించిన ఓర్వకల్లు విమానాశ్రయం

- రోడ్లు, నీరు, విద్యుత్, రైల్వే వంటి మౌలిక వసతులకు నిధులు
- పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేసిన కేంద్ర బడ్జెట్
- వెనుకబడిన సీమ జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ
- బడ్జెట్‌లో వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

సాధారణ ఎన్నికల తర్వాత మొదటిసారి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు, రాష్ట్రానికి ఆశలు కలిగించేలా ఉంది. ఓర్వకల్లు పారిశ్రామివాడలో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా మౌలిక వసతుల ఏర్పాటుకు నిధులు వెచ్చిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్-2024-25లో వెల్లడించారు. రాష్ట్ర విభజన తరువాత ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌కు శ్రీకారం చుట్టారు. ఆసియాలోనే అదిపెద్ద వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. కేంద్ర రక్షణ శాఖ ఆయుధ తయారీ పరిశ్రమ (డీఆర్‌డీఓ) తెచ్చారు. ప్రపంచంలోనే తొలి పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు నాంది పలికారు. కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రాయం నిర్మించారు. 2019లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వంలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పడకేసింది. తాజాగా సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ అది జీవం పోసుకుంది. హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో నీరు, విద్యుత్తు, రైల్వే, రోడ్లు వంటి మౌలిక వసతులకు నిధులు ఇస్తామని, ఆర్థికవృద్ధి, పెట్టుబడులకు మూలధనం ఈ ఏడాదే అదనపు కేటాయింపులు చేస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. గత టీడీపీ ప్రభుత్వంలోనే పారిశ్రామిక అవసరాల కోసం ఓర్వకల్లు మండలంలో 4 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మించి ముచ్చుమర్రి నుంచి ఎత్తిపోయాలని, కర్నూలు మండలం దూపాడు నుంచి ఓర్వకల్లుకు రైల్వే లైన్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. రైల్వే లైన్ నంద్యాలకు పొడిగిస్తే కర్నూలు-విజయవాడ వయా నంద్యాల మీదుగా రైళ్లు కూడా నడపవచ్చు. పదేళ్ల కింద చంద్రబాబు ఆలోచనల నుంచి పురుడుపోసుకున్న ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పనులు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటనతో ముందుకు పోవడానికి అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

కరువు ప్రాంతం అభివృద్ధికి జీవం



రాజధాని అమరావతి, ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు, జిల్లాలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ సహా వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆ సమయంలో పార్లమెంట్‌లో నేను కూడా ఉండడం మరవలేని ఆనందం. కర్నూలు ఎంపీగా ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వానికి జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ

చంద్రబాబు విజన్ ఇలా ఉంటుంది



చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన 45 రోజులకే కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల వరద మొదలైంది. కేంద్ర బడ్జెట్‌లో రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడమే కాకుండా పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇస్తామని మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఓర్వకల్లు పారిశ్రామి హబ్‌లో మౌలిక వసతులకు నిధులు ఇస్తామని, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం అభినందనీయం. చంద్రబాబు విజన్ ఇలా ఉంటుందని. జగన్ ఐదేళ్ల పాలనలో ఒక్క పైసా రాబట్టలేకపోయారు.

- సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజలకు భరోసా ఇచ్చారు



అన్ని వర్గాల ప్రజలకు భరోసా ఇచ్చేలా కేంద్ర బడ్జెట్ ఉంది. ఆదాయ పన్ను స్లాబులు మార్చడం వేతనజీవులకు మేలు చేస్తుంది. పేదల పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రాధ్యానత ఇచ్చారు. ముఖ్యంగా మన రాష్ట్రానికి నిధుల కేటాయింపులో పెద్దపీట వేయడం అభినందనీయం. వెనుకబడిన జిల్లాల గ్రాంట్ ద్వారా మన జిల్లా ప్రగతికి అడుగులు పడినట్లే

- చింతా సురేశ్, జనసేన జిల్లా కన్వీనర్, కర్నూలు.

ఎన్డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకుంది



వికసిత్ భారత్‌లో భాగంగా కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించారు. గత ప్రభుత్వం అమరావతిని చంపేస్తే.. ఎన్డీఏ ప్రభుత్వం జీవం పోసి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ఇచ్చింది. ముద్ర రుణాలు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచి చిరువ్యాపారులకు ఆర్థిక చేయుత ఇచ్చింది. విద్యార్థులకు 3 శాతం విద్యా రుణం, కార్మికులకు డార్మెంటరీ తరహాలో అద్దె ఇళ్ల నిర్మాణం, కోటి మందికి యువతకు ఉపాధి కల్పనకు శ్రీకారం చుట్టడం అభినందనీయం.

- కునిగిరి నీలకంఠ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట



సీఎం చంద్రబాబు పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, మంత్రులను కలసి గత జగన్ ప్రభుత్వం సాగించిన విధ్వంస పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఏ స్థాయిలో నష్టపోయిందో వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేంద్ర సహకారం కావాలని ప్రధాని మోదీని ఒప్పించారు. ఆయన విజన్ వల్లనే కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి పెద్దపీట దక్కింది. గతంలో జగన్ కేసుల మాఫీ కోసం ఢిల్లీకి వెళితే... చంద్రబాబు ప్రగతి కోసం వెళ్లి నిధులు రాబట్టారు. జిల్లాలో ఓర్వకల్లు పారిశ్రామిక హబ్‌లో మౌలిక వసతులతో పాటు వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు ద్వారా పశ్చిమ ప్రాంతంలో అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి.

- బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే

రాష్ట్రానికి సముచిత స్థానం కల్పించారు



జగన్ పాలనతో ప్రజాస్వామ్య వ్యవస్థలు పతనావస్థకు చేరాయి. చంద్రబాబు విన్నపాన్ని ఆలకించిన కేంద్ర పెద్దలు అమరావతి, పోలవరం, ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ మౌలిక సదుపాయాల కోసం నిధులు ప్రకటించడం సంతోషదాయకం. వెనుబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇస్తామని చెప్పడం జిల్లాలోని కరువు పల్లెలు ఊపిరి పీల్చుకునే అవకాశం కలిగింది

- తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

తాగునీటి అవసరాలకు రూ.77 కోట్లు మంజూరు చేయండి

మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలసిన ఎమ్మెల్యే



మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, జూలై 23: జల్ జీవన్ మిషన్ పథకం కింద ఆదోని అసెంబ్లీ పరిధిలోని గ్రామీణ ప్రాంత ప్రజల దాహం తీర్చేందుకు రూ.77 కోట్ల మేర నిధులను మంజూరు చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరినట్లు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల విరామ సమయంలో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆదోని మండలంలోని 25 గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి పథకం ప్రారంభానికి నోచుకోలేదన్నారు. గ్రామాలకు తాగునీటిని అందించి సహకరించాలని కోరారు. అలాగే గ్రామీణ ప్రాంతంలో శిథిలమైన రోడ్ల నిర్మాణం కోసం అత్యవసరంగా రూ.13కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

- చంద్రబాబు శాంతి భద్రతలు పరిరక్షించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కర్నూలు(న్యూసిటీ), జూలై 23: ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం సీఆర్ భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్యలతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర విభజన తరువాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్నికల సమయంలో ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలు లేవన్నారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాలు, అప్పులపైనే గవర్నర్ ప్రసంగం సాగిందన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని, పూర్తిస్థాయి బడ్జెట్ ఏర్పాటు చేస్తే బాగుండేదన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, పోలవరం నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాలని అన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఏపీని ఆదుకుని ఆర్థికంగా గాడిలో పెట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ముచ్చుమర్రిలో బాలికపై అఘాయిత్యం చేసి హత్య చేయడం దారుణమన్నారు. నేటికి బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించలేకపోవడం బాధాకరమని అన్నారు. రాయలసీమలో వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు వేసి పంటలు ఎండిపోయాయని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ధరలు తగ్గించి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్నాథం, రామకృష్ణారెడ్డి, రాజాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వో మధుసూదన్‌రావుకు అదనపు బాధ్యతలు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 23: కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా డీఆర్వో మధుసూదన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. దీంతో డీఆర్వో మధుసూదన్‌రావుకు జిల్లా జాయింట్ కలెక్టర్ అదనపు బాధ్యతలు కేటాయించారు. అనంతరం బదిలీపై వెళ్లనున్న జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను డీఆర్వో మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లాకు ఎంతో సేవలు చేశారనీ డీఆర్వో జేసీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జేసీ మౌర్యను సన్మానిస్తున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు జీజీహెచ్‌లో ఐసోలేషన్ వార్డు

నిఫా వైరస్‌తో అప్రమత్తమైన అధికారులు



నిఫా వార్డును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్, వైద్య బృందం

కర్నూలు(హాస్పిటల్), జూలై 23: దేశంలో నిఫా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో జిల్లా వైద్యశాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లో హుటాహుటిన ప్రత్యేకంగా ఆరుపడకలతో ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశారు. నిఫా వైరస్ సోకి కేరళలో 14 ఏళ్ల బాలుడు మృతి చెందడాన్ని పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ధ్రువీకరించింది. ఈ తరుణంలో ప్రాణాంతకంగా మారిన నిఫా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. నిఫా వైరస్ వ్యాప్తి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్ని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. అన్ని రాష్ట్రాలు క్వారంటైన్ వార్డులు, మందులు సిద్ధం చేసుకోవాలని సూచించింది. నిఫా వైరస్ కేరళలో 1999లో తొలిసారిగా వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత 2019లో ఈ వైరస్ కారణంగా 27 మంది మరణించారు. మళ్లీ ఇప్పుడు ఈ వైరస్ విజృంభిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో నిఫా వైరస్‌ను ఎదుర్కోవడానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి వైద్యులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఊపిరితిత్తులు (పల్మనాలజీ) అనస్థీషియా జనరల్ మెడిసిన్, మైక్రోబయాలజీ వైద్యులతో కూడిన రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు సిద్ధం చేయాలని ఆయా హెచ్‌వోడీలను ఆదేశించారు. సీపీఏపీ, బీఐపీఏపీ యంత్రాల కోసం ఎన్‌95 మాస్కు అందుబాటులో ఉండేలా సర్జికల్ స్టోర్ సిబ్బందికి తెలియజేశారు. ఆసుపత్రిలో నిఫా వైరస్ నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ కె.విద్యాసాగర్‌ను నియమించారు. పీపీఈ కిట్లకు సంబంధించిన తగినంత స్టాక్ అందుబాటులో ఉండాలని సూపరింటెండెంట్ ఆదేశించారు. ఈ సమీక్షలో జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఇక్బాల్ హుశేన్, ప్రొఫెసర్లు లక్ష్మీబాయి, హెచ్‌ఓడీలు రాంశివనాయక్, కొండారెడ్డి, సీఎస్ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ హేమనళిని, ఏఆర్ఎంఓ వెంకటరమణ పాల్గొన్నారు.



ఐసోలేషన్ వార్డు

ఎస్పీని కలిసిన జనసేన నాయకులు


ఎస్పీ బిందుమాధవ్‌తో జనసేన నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 23: కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్‌ను జనసేన ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి కర్నూలు జిల్లా సమన్వయకర్త చింతా సురేష్‌బాబు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో అధికార యంత్రాంగానికి జనసేన పార్టీ తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పీవీబీ సుబ్బయ్య, బజారి, సుమలత పాల్గొన్నారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి

ఓర్వకల్లు, జూలై 23: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గల సచివాలయాల్లో ఈ నెల 23 వతేదీ నుంచి 27వ తేదీ వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎంపీడీవో మల్లేశ్వరి మంగళవారం తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

గ్రామాల్లో పర్యటించిన తహసీల్దార్

సి.బెళగల్. జూలై 23: తుంగభద్ర నదీతీర గ్రామాలైన తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, శింగవరం, ఈర్లదిన్నె, కొత్తకోట గ్రామాలను తహసీల్దార్ అనుపమ మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు, గొర్రెలు, మేకలు, పసువుల కాపరులు నది వద్దకు వెళ్లరాదన్నారు. అలాగే పాత మట్టిమిద్దెలు ఉన్నవారు ఇళ్లలో ఉండకూడదన్నారు. విద్యుత్ ఏఈ సుకుమార్ మాట్లా డుతూ రైతులు రాత్రి సమయాలలో విద్యుత్ మోటార్లను, స్తంభాలను తాకరాదు అన్నారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, వీఆర్వోలు ఉన్నారు.

చైన్ స్నాచింగ్

కర్నూలు, జూలై 23: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో కాదాంబరి టౌన్‌షిప్‌లో జయలక్ష్మి అనే వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించారు. కాదాంబరి టౌన్‌షిప్‌లో జయలక్ష్మి అనే వృద్ధురాలు ఇంటి ముందు నిల్చుని ఉండగా మంగళవారం సాయంత్రం బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు తాగడానికి నీళ్ల కావాలని అడిగారు. ఆమె ఇంట్లోకి వెళ్లి నీరుతెచ్చి ఇవ్వగా ఇంతలోనే బైక్‌పై వెనుక కూర్చున్న ఓ ఆగంతకుడు మెడలోని గొలుసును తెంచుకుని ఉడా యించాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు సంఘ టనా స్థలానికి వెళ్లి విచారించారు. గొలుసు విలువ 3 తులాలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఇద్దరి అదృశ్యం

కర్నూలు, జూలై 23: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు కారణాలతో ఇద్దరు అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. గణేష్ నగర్‌లో నివాసముంటున్న షేక్షావలి అనే యువకుడు ఈ నెల 10న ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఇంత వరకు తిరిగి రాకపోవడంతో యువకుని తల్లి షేక్ నసీమా పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే స్థానిక శ్రీరామ్‌నగర్‌కు చెందిన లక్ష్మి అనే మహిళ ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో కొడుకు వీరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 16 కేసులు నమోదు

కర్నూలు, జూలై 23: నగరంలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం రాత్రి 16 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సుంకేసుల రోడ్డులోని సంజీవిని హాస్పిటల్ దగ్గర ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12 ద్విచక్ర వాహనదారులు, రెండు కార్లు, రెండు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు రుస్తామని సీఐ గౌతమి తెలిపారు.

జిల్లా రెజ్లింగ్ సంఘం కార్యదర్శి మృతి

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 23: సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు, జిల్లా రెజ్లింగ్ సంఘం కార్యదర్శి అబ్రహం లింకన్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం కర్నూలులో అంత్యక్రియలు నిర్వహిస్తారని బంధువులు తెలిపారు. ఈయన మృతిపై సీనియర్ పీఈటీ, పీడీలు, వివిధ సంఘాల కార్యదర్శులు రామాంజనేయులు, సుధీర్, సునీల్ కుమార్, శ్రీనివాసులు, హర్షవర్ధన్ సంతాపం తెలిపారు.

ఉద్యోగులను, మధ్యతరగతి ప్రజలను నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 23: పాత పన్ను విధానంలో కొనసాగుతున్న ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు మంగళవారం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ నిరాశపరిచిందని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. గోకారి, టీకే జనార్దన్ మంగళవారం తెలిపారు. గత పది సంవ త్సరాలుగా ఆదాయపు పన్ను మినహాయింపు రెండున్నర లక్షలకే పరిమితమైందని తెలిపారు. ఒకవైపు 8 లక్షలలోపు ఆదాయం కలవారని, ఆర్థికంగా వెనుకబడిన వారిగానే పరిగణిస్తూ, మరోవైపు రెండున్నర లక్షల ఆదాయం దాటిన వారి నుంచి పన్ను వసూలు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

ఎన్‌డీఏ ప్రభుత్వంలోనే ఏపీ సర్వతోముఖాభివృద్ధి

కల్లూరు, జూలై 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చామకూర వీరప్ప అన్నారు. మంగళవారం కల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఆయన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశా రు. అమరావతి అభివృద్ధికి రూ. 15వేల కోట్లు, పోలవరం నిర్మాణానికి పెద్దపీట, పాణ్యం నియో జకవర్గం ఓర్వకల్లు బెంగళూరు పారిశ్రామిక కారిడార్ కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషక రమన్నారు. కార్యక్ర మంలో బీజేపీ నాయకులు తారకేశ్వరుడు, గంగాధర్, మదన్ మోహన్ ఆచారి, కోనేటి వేణు, వీరమ్మ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

సి.బెళగల్, జూలై 23: మండలంలోని తిమ్మనదొడ్డి సమీపంలోని నదిలో నుంచి సంగాలకు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఎస్‌ఐ తిమ్మారెడ్డి, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు.

ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి



బాలగంగాధర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, వృద్ధులకు స్వీట్లు అందజేస్తున్న కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 23: బీ.క్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా బాల గంగాధర్ తిలక్ స్థాపిం చిన కేసరి పత్రిక ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని నింపారని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, విజ యశేఖర్, మల్లికార్జున, కృష్ణమోహన్, సోమేష్, ఉల్లోజీరావు, చిన్న మల్లేశ్వరుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర తిలక్, చంద్రశేఖర ఆజాద్ జయంతిని మంగళవారం అశోక్‌నగర్‌లోని వృద్ధుల ఆవాస కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు జీబీ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తిలక్, చంద్రశేఖర ఆజాద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు ప్రకాశ్, రమేష్, వెంకటేశ్వర్లు, సామా జిక సేవకుడు గోవిందరావు పాల్గొన్నారు.

శానిటేషన్ డ్రైవ్ నిర్వహించండి: కలెక్టర్



కర్నూలు(కలెక్టరేట్), జూలై 23: వర్షాకాలం ముగిసేంత వరకు దాదాపు మరో నెల దాకా జిల్లాలో శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు మండల స్థాయి అధికారులతో శానిటేషన్ డ్రైవ్‌పై టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లు షెడ్యూల్ ప్రకారం శానిటేషన్ డ్రైవ్ నిర్వ హించి నివేదికలు పంపించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదని అధికారులను ఆదేశించారు. తాగునీటికి క్లోరినేషన్ పరీక్షలు చేయించాలని, డ్రైనేజీ క్లీనింగ్, ఫాగింగ్ ఇతర పారిశుధ్య కార్యక్రమాలను తప్పనిసరిగా చేపట్టాలన్నారు. గూడూరు, గోనె గండ్ల, కోడుమూరు, కౌతాళం, తదితర మండలాల్లో శానిటేషన్ డ్రైవ్ సరిగ్గా జరగడం లేదని అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎల్లెల్సీ నుంచి నీరు వస్తున్నందున ఆ నీటిని ముందుగా తాగునీటి స్టోరేజ్ ట్యాంకులో నింపాలన్నారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో టెయిల్ ఎండ్ పాయింట్స్ వరకు నీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, డీపీవో నాగరాజు నాయుడు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

స్టాఫ్ డయేరియా లక్ష్యం సున్నా మరణాలు

కర్నూలు జీజీహెచ్‌లో కేంద్ర బృందం తనిఖీ

కర్నూలు(హాస్పిటల్), జూలై 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్టాఫ్ డయేరియా లక్ష్యం ప్రకారం చిన్న పిల్లల్లో అతిసార మరణాలు సున్నాకు చేరుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కన్సల్టెంట్లు డాక్టర్ విశాల్, డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. స్టాఫ్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేంద్ర, రాష్ట్ర బృందాలు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల చిన్న పిల్లల విభాగాన్ని సందర్శించారు. పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా. విజయానందబాబుతో కలిసి ఎస్‌ఎన్‌సీయూ, ఎన్‌ఆర్‌సీ, ఐపీ, ఓపీలను పరిశీలించారు. అనంతరం కేంద్రం వైద్యబృందం వార్డు పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డా.ఎం. మల్లికార్జున, ఎస్‌ఎన్‌సీయూ నోడల్ ఆఫీసర్ డా.పి. రవీంద్రనాథ్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.కృష్ణ, డా. లక్ష్మీనారాయణ, ఎన్‌ఆర్‌సీ న్యూట్రిషన్ కౌన్సిల్ జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హేమలత

ఓర్వకల్లు, జూలై 23: పరిసరాలు శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ హేమలత అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సామాజిక ఆరోగ్య అధికారులు, మహిళ కార్యకర్తలతో సీజనల్ వ్యాధులపై డా.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారుల్లో అతిసార మొదలైనప్పటి నుంచి ప్రతి వాంతులు విరేచనాలు తర్వాత తగ్గేవరకు ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని ఇవ్వాలన్నారు. ఒక చెంచా తాగునీరు లేదా తల్లి పాలల్లో బాగా కలిపి జింక్ మాత్రను కలిపి నాలుగు రోజుల పాటు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డా.నాగరాజు, వైద్య సిబ్బంది ప్రభాకర్ రెడ్డి, విజయలక్ష్మి, మంగమ్మ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక


మాట్లాడుతున్న పీడీ అమర్నాథ్‌రెడ్డి

గూడూరు, జూలై 23: గూడూరులో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక సదస్సును నిర్వహిం చారు. మంగళవారం గూడూరులోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణ లో ఉపాధి హామీ పథకం 2023-24సంవత్సరం గాను సామాజిక ప్రజా వేదిక సదస్సు పీడీ అమర్‌నాథ్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరంలో మండలంలో చేపట్టిన పనులు, చేసిన ఖర్చు వివరాలను వెల్ల డించారు. కార్యక్రమంలో డీవీవో భాస్కర్, ఫైనాన్స్ మేనేజర్ ఆదయ్య, ఏపీడీ అల్లిపీర, ఏవీవో లక్ష్మీనారాయణ, ఎంపీడీవో విజయసింహారెడ్డి, ఎస్‌ఆర్‌పీ విజయ భాస్కర్, సామాజిక తనిఖీ బృందం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక ఇన్‌చార్జి కమిషనర్‌గా పీవీ రామలింగేశ్వర్

కర్నూలు(కల్చరల్), జూలై 23: కర్నూలు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా పీవీ రామలింగేశ్వర్ మంగళవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేసిన ఎ.భార్గవతేజ గుం టూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే. కాగా ఆయన మంగళవారం రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌కు, ఇన్‌చార్జి కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అత్యాచారాలు, హత్యల నివారణకై ఉద్యమిద్దాం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 23: కెప్టెన్ లక్ష్మీ సెహగల్ స్ఫూర్తితో అత్యాచారాలు, హత్యల నివారణ కోసం ఉద్యమిద్దామని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి. నిర్మలమ్మ కోరారు మంగళవారం స్థానిక ఆర్‌ఎంకే ప్లాజా నారాయణ జూనియర్ కళాశాలలో ఐద్వా జిల్లా కోశాధికారి పీఎస్ సుజాత అధ్యక్షతన మహిళలు, మైనర్ బాలికలపై అత్యాచారాలను హత్యలను నివారిద్దాం అనే అంశంపై కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రేవతి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మీ సెహగల్ స్వాతంత్ర్యోద్యమంలో ఆజాద్ హింద్ ఫౌజ్ మహిళా దళాల్లో చేరి కెప్టెన్‌గా హోదా పొంది, డాక్టర్‌గా వైద్యసేవలు అందించారని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త ఏఎంసీ, క్యాజువాల్టీలతో మెరుగైన సేవలు

కర్నూలు(హాస్పిటల్), జూలై 23: కర్నూలు సర్వజన వైద్యశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాజువాల్టీ, ఏఎంసీ వార్డుల వల్ల రాయలసీమ జిల్లాల నుంచి అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులకు మేలు జరుగుతుందని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు అన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలు నాయక్, రాష్ట్ర ఈసీ సభ్యులు ఖాజా మొయిద్దీన్, సురేష్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నెలన్నర రోజులు వ్యవధిలోకే ఏఎంసీ, క్యాజువాల్టీ వార్డులను అందుబాటులోకి తీసుకుని వచ్చిన ఘనత డాక్టర్ ప్రభాకర్ రెడ్డికే దక్కుతుందని అన్నారు.

ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు

ఓర్వకల్లు, జూలై 23: గత ప్రభుత్వంలో మానవ హక్కుల ఉల్లంఘనలు చాలా జరిగాయని, ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు హనీఫా పాషా అన్నారు. మంగళవారం మండలంలోని నన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ఢిల్లీ వెళ్లి టీడీపీ ప్రభుత్వం వైఫల్యం చెందిందని చెబుతున్నారని, అయితే వాస్తవాలు ప్రజలకు తెలుసని అన్నారు. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, సీఎం చంద్రబాబు రాజకీయ అనుభవం రాబోయే తరానికి ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

ఏఎన్‌ఎంలు ఇంటింటా సర్వే చేయాలి.

సి.బెళగల్, జూలై 23: ఏఎన్‌ఎంలు ఇంటింటి సర్వే చేయాలని వైద్యాధికారి మిథున్‌కుమార్‌రెడ్డి ఏఎన్‌ఎంలకు మంగళవారం ఆదేశించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సి. బెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బ్యాథోలి, బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, కంబందహాల్, పలుకుదొడ్డి, సంగాల, తిమ్మనదొడ్డి, గుండ్రేవుల గ్రామాలలోని ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ప్రతి కుటుంబంలోని ఆరోగ్య వివరాల గూర్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌మ్‌లు ఉన్నారు.

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు


మాట్లాడుతున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జూలై 23: ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి శాసనమండలి ఉప నాయకుడు బీటీ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం విడదీసిందని ఆ తర్వాత ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేసిందని అన్నారు. 2019 ఎన్నికల్లో ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి వికృత చేష్టల వల్ల రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. తిరిగి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎంగా చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నారని అన్నారు.

డంప్‌యార్డ్‌కు స్థలం కేటాయించాలి: ఆర్డీవో


మునగాల రహదారిలో ఉన్న డంప్‌యార్డ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో, కమిషనర్

గూడూరు, జూలై 22: గూడూరు నగర పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను వేసేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆర్డీవో శేషిరెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు గూడూరులో పర్యటించిన ఆర్డీవో శేషిరెడ్డి, కమిషనర్ దివాకర్ రెడ్డి, ఎంఈవో సునీలమ్మ, ఏఈ నరసింహులతో కలిసి జడ్పీ హైస్కూల్ (బాలురు, బాలికలు) ను సందర్శించి తనిఖీలు చేపట్టారు. పరిసరాలను, తరగతి గదులు, టాయి లెట్స్‌లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లలకు నాణ్యమైన భోజ నం అందించాలని, ప్రజలకు స్వచ్ఛమై తాగునీరు అందించాలని సూచించారు. అనంతరం మునగాల రహదారిలో ఉన్న డప్పుయార్డ్‌ను పరిశీలించారు. నగర పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్తను వేసుకునేందుకు స్థలం లేనందున అనువైన స్థలాన్ని కేటాయించాలని కమిషనర్ దివాకర్ రెడ్డి కోరగా స్థలాన్ని కేటాయించాలని ఆర్డీవో రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: జడ్పీ సీఈవో


మొక్క నాటుతున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

ఓర్వకల్లు, జూలై 23: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జడ్పీ సీఈవో నాసరరెడ్డి అన్నారు. మంగళవారం ఓర్వకల్లు ఉపాధి హామీ కార్యాలయం ఎదురుగా సీఈవోతోపాటు అధికారులు మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ, ఆరోగ్య కార్యదర్శులు మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జడ్పీ సీఈవో నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ సిద్దలింగమూర్తి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టాలన్నారు. ఓర్వకల్లు ఎంపీడీవో మల్లేశ్వరి మండలంలో 9వేల మొక్కలు నాటించడంతో ఆమెను సీఈవో అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశ్వరి, డీఎల్‌పీవో తిమ్మక్క, ఈవో ఆర్‌డీ సుబ్బరాయుడు, ఏఈ రామయ్య, జడ్పీటీసీ రంగనాథగౌడ, ఎంపీపీ తిప్పన్న, టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామరాజు, సర్పంచ్ పెద్ద కాశీం పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 23: జిల్లాలోని పారిశుధ్యం పనులపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీపీవో నాగరాజు నాయుడు హెచ్చరించారు. మంగళవారం గొందిపర్ల గ్రామంలో తాగునీరు సరఫరా, పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీడీవో, ఈవోఆర్డీ ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి


చిన్నటేకూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కల్లూరు, జూలై 23: గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఆయన చిన్నటేకూరు, తడకనపల్లె గ్రామాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. డ్రైనేజీలను శుభ్రం చేయాలని, ఖాళీ ప్రదేశాల్లో మురుగ నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ ట్యాం కులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. బస్తిపాడు గ్రామ సచివాల యంలో మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అలాగే బస్తిపాడు గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్ కింది సాగైన తోటను ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఓ మద్దీశ్వ రమ్మ పాల్గొన్నారు.

● **ఆధార్ నమోదు చేసుకోండి:** కల్లూరు మండలం కే.మార్కాపురం, బొల్లవరం, కొంగనపాడు, పందిపాడు గ్రామాల్లో బుధవారం నిర్వహించ నున్న మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు.

పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి.బెళగల్, జూలై 23: పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి శ్యామల పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణదొడ్డి, పోలకల్లు గ్రామాల్లోని తాగునీరు, మురుగుకాలువలు, వాటర్ ట్యాంక్‌లను ఆమె పరిశీలించారు. పంచాయతీలలో ఇలాగే అపరిశుభ్రంగా ఉండటం వలన ప్రజ లు నిత్యం అనారోగ్యాలకు గురువుతున్నారన్నారు. అనంతరం ఆయా గ్రామా ల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఈవోఆర్డీ సందీప్, ఎంపీపీ బొంతల మునెప్ప, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఉన్నారు.

రాజకీయ వేధింపులు మానుకోవాలి


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నరసింహులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 23: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలని ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ వద్ద యూనియన్ నాయకుడు పెద్దరాజు నాయక్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నరసింహులు మాట్లా డుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే ప్రయత్నం కొనసాగి స్తున్నారని అన్నారు. ఉద్యోగులను తొలగించడం వల్ల కొందరు మానసిక ఒత్తిడికి గురై ఇప్పటికే రాష్ట్రంలో ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ధర్నాకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు మద్దతు తెలిపారు. జిల్లా కార్యదర్శి వీరేష్ గౌడు కోశాధికారి వీరేష్, నాయకులు విశ్వనాథ్, మహబూబ్ పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖ తనిఖీలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 23: నగరంలోని ఏ.క్యాంపులో ఉన్న మండల లెవెల్ స్టాక్ పాయింట్‌ను తూనికలు కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. మంగళవారం ఎం.ఎల్ పాయింట్ నుంచి చౌకదుకాణాలకు సరఫరా చేస్తున్న వాహనాల్లోని పీడీఎస్ బియ్యం సంచులను ఎలక్ట్రానిక్ కాటాలో తూకం వేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు మాట్లాడుతూ చౌకదుకాణాలకు సరఫరా అయ్యే బియ్యంలో తూకం తక్కువగా వస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో భాగంగానే తనిఖీలు చేయగా లోపాలు లేవని ఆయన స్పష్టం చేశారు. ముున్ముందు కూడా తనిఖీలు ముమ్మరం చేస్తామని తెలిపారు.

ఈత విజేతలకు అభినందన

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 23: ఇటీవల కాకినాడలో నిర్వహించిన 7వ రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో జిల్లా స్విమ్మర్ల ప్రతిభ చాటి విజేతలయ్యారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగంలో దేవస్మిత్ సాయి, వర్షిక, షేక్ సాని యా, లహరి, చిరు చరణ్‌తేజ్ మోడరన్ పెంటాతలన్‌లో విజేతలయ్యారు. డీఎస్‌ఏ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయ వాది శ్రీధర్‌రెడ్డిలు వీరికి అభినందనలు తెలిపారు.

పాఠశాలల్లో శిక్షా సప్తాహాన్ని పకడ్బందీగా నిర్వహించాలి


విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈవో

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 23: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు చేపట్టిన శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో శామ్యూల్ తెలిపారు. మంగళవారం బి. తాండ్రపాడు ఎంపీపీఎస్ మోడల్ ఫౌండేషన్ స్కూల్‌ను డీఈవో సందర్శించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, అధ్యాపకులు ఎస్ఎస్‌ఏ రఫీ, జిల్లా కో ఆర్డినేటర్ దావీదు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లపై జరిమానా

కోడుమూరు(రూరల్), జూలై 23: కోడుమూరు సెబ్ పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని జరిమానా విధించారు. సెబ్ ఎస్‌ఐ అలీబేగ్ మాట్లాడుతూ మన్నెకుంట వద్ద హంద్రీ నది నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌పై రూ 10 వేలు జరిమానా విధించి ఖజానాకు జమ చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం, ఇసుక రవాణా, నాటుసారాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. దాడుల్లో సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, విరుపాక్షిరెడ్డి, వెంకటేష్‌నాయక్ పాల్గొనారు.

● **28న వాహనాల వేలం: సెబ్ సీఐ**

అక్రమ మద్యం, నాటుసారా కేసుల్లో పట్టుబడి సీజ్ అయిన వాహనాల వేలాన్ని ఈ నెల 28న చేపట్టనున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. కర్నూలు ఈఎస్ పర్యవేక్షణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు వేలంలో పాల్గొనాలని కోరారు. కోడుమూరు సెబ్ పోలీసు స్టేషన్ ఆవరణలో 28న ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

గంగఒడిలోకి...



సంగమేశ్వరాలయాన్ని ముంచెత్తిన వరద

- జలాధివాసమైన సంగమేశ్వరుడు
- క్షేత్రాన్ని ముంచెత్తుతున్న వరద
- 234 రోజుల పాటు భక్తులకు దర్శనం
- క్షేత్రంలో కొనసాగిన అంత్యపూజలు


ఆత్మకూరు/కొత్తపల్లి, జూలై 23: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శ్రీశైల జలాశయానికి భారీగా వరదనీరు వచ్చిచేరుతోంది. దీంతో శ్రీశైలం బ్యాక్‌వాటర్ ప్రదేశంలో ఉన్న సంగమేశ్వర క్షేత్రాన్ని నదీజలాలు ముంచెత్తుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నానికి గర్భాలయంలోకి వరదజలాలు ప్రవేశించి వేపదారు శివలింగాన్ని చేరాయి. ఆ తర్వాత గంట గంటకు నీటిమట్టం పెరిగి సంగమేశ్వరుడు సంపూర్ణంగా జలాధివాసమయ్యారు. వరద ఉధృతి పెరిగి సంగమేశ్వరాలయాన్ని చుట్టుముట్టి ముంచెత్తుతున్నాయి. సంగమేశ్వర క్షేత్రంలోని లలితాసంగమేశ్వర స్వామి, అమ్మవార్లు జలాధివాసం సందర్భంగా చివరి రోజు ఆలయ ప్రధాన పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ అంత్యపూజలు నిర్వహించారు. ముందుగా వేపదారు శివలింగానికి రుద్రభిషేకం చేసి, జలాధివాస మంగళహారతిని నివేదించారు. అలాగే క్షేత్రంలో జలాధివాస హోమాలు చేసి సప్తనదీ జలాలకు వడిబియ్యం, గంగా హారతులను సమర్పించారు. సంగమేశ్వరాలయం జలాధివాసమయ్యే అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

శ్రీశైలానికి పెరిగిన ఇన్‌ఫ్లో

శ్రీశైలం, జూలై 23: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలో మంగళవారం భారీగా ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాల జలాశయం నుంచి 1,51,790 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,55,323 క్యూసెక్కుల వరద ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 842.40 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 65.5945 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు.



సంగమేశ్వరాలయ ఆవరణలోకి చేరిన వరదనీరు



వరద జలాలకు గంగాహారతి నివేదిస్తున్న పురోహితులు

234రోజులు పూజలందుకున్న సంగమేశ్వరుడు

శ్రీశైలానికి గత ఏడాది జూలై 29వ తేదిన వరద వచ్చిచేరడంతో సంగమేశ్వరుడు జలాధివాసం అయ్యారు. ఆ తర్వాత 126 రోజుల పాటు నదీగర్భంలో ఒదిగిన సంగమేశ్వరుడు గత ఏడాది డిసెంబరు 3వ తేదిన పూర్తిగా బయల్పడి తిరిగి పూజలందుకున్నారు. అప్పటి నుంచి 234 రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న సంగమేశ్వరుడు మళ్లీ జలాధివాసమవ్వడం గమనార్హం. కాగా శ్రీశైలం జలాశయం వెనకతట్టు జలాల్లో 1981లో జలాధివాసమైన సంగమేశ్వరుడు సుమారు 22ఏళ్ల పాటు నదీగర్భంలోనే ఉండి ఆ తర్వాత 2003లో తొలిసారిగా నదీజలాల నుంచి బయల్పడ్డాడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి శ్రీశైలఖండం స్కందపురాణంలోని సంగమేశ్వర మహత్యంలో చెప్పబడిన విధంగా సంగమేశ్వరుడు ప్రతిఏటా కొద్దినెలల పాటు జలాధివాసమై ఆ తర్వాత తిరిగి పూజలందుకోవడం పరిపాటిగా వస్తోంది. సంగమేశ్వరాలయం జలాధివాసం కావడంతో ఎగువ ఉమామహేశ్వరాలయంలో పూజలు జరగనున్నాయి.



జలాధివాసం అవుతున్న సంగమేశ్వరుడు

చంద్రబాబుతోనే అభివృద్ధి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుసేన్



నంద్యాల (నూనెపల్లె), జూలై 23: రాష్ట్రం అన్ని విధాలుగా పరుగులు తీయాలంటే అది సీఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్ హుసేన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రం 20 ఏళ్ళు వెనుకబడి పోయిందన్నారు. రాష్ట్రం పునర్నిర్మాణం, ప్రజల సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం, రాయలసీమ అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు రాబట్టడంలో టీడీపీ విజయం సాధించిందన్నారు. రాష్ట్రంలో రాజకీయ కుల మత ప్రాంతీయ విభేదాలు లేకుండా అన్ని కలుపుకుని అభివృద్ధి చేసే విధంగా చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు.

రాష్ట్రానికి న్యాయం జరిగింది

- తుగ్గలి నాగేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి



తుగ్గలి, జూలై 23: కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో న్యాయం జరిగిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్ విడుదలపై ఆయన స్పందించారు. ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఇకపై రాష్ట్రం పరుగులు తీస్తుందన్నారు. పలుమార్లు రాష్ట్ర సమస్యలను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి నిధులు రాబట్టడంలో చంద్రబాబు పాత్ర అమోఘమన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిని దూరం చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఇదొక చెంప పెట్టులాగా మారిందన్నారు. రాజధానికి నిర్మాణానికి రూ. రూ.15వేల కోట్లు విడుదలపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని తుగ్గలి నాగేంద్ర పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

- డీసీసీ అధ్యక్షుడు బాబురావు



కర్నూలు(అర్బన్), జూలై 23: కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమి లేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. బాబురావు అన్నారు. ఇదొక అంకెల గారడి బడ్జెట్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.లక్ష కోట్లు కావాలని అడిగారన్నారు. కానీ ఏపీకి రూ.12 లక్షల కోట్లు అవసరమన్నారు. బడ్జెట్‌లో కేవలం రాజధానికి నిధులు ఇస్తామని చెప్పారన్నారు. కానీ పోలవరం ప్రాజెక్టుకు ఎంతమేర నిధులు ఇస్తారన్నది స్పష్టత లేదన్నారు.

రాష్ట్రానికి ప్రాధాన్యత ఏదీ..?

సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్



కర్నూలు(కల్చరల్), జూలై 23: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశించినంత ప్రాధాన్యం దక్కలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని ఆశించే ప్రజలకు నిరాశ మిగిల్చిందని విమర్శించారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు నేరుగా, గ్రాంటుగా ప్రకటించకుండా వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలు కట్టుబడి ఉంటామని చెప్పి, నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు.

శ్రీశైలంలో భారీగా మద్యం పట్టివేత

శ్రీశైలం/నంద్యాల క్రైం, జూలై 23 : శ్రీశైలం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం భారీగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు శ్రీశైలం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తన సిబ్బంది రఘునాథుడు, బాలకృష్ణ, మహేష్, నాగవేణి తదితరులతో శ్రీశైలంలోకి వచ్చిన టీఎస్ఆర్టీసీ బస్సును బస్టాండు సమీపంలో తనిఖీ చేశారు. బస్సులో ఇద్దరు మహిళలు మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తుండగా గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 248 తెలంగాణ మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మహిళలు శ్రీశైలం గ్రామానికి చెందిన రాత్లావత్ బుజ్జిబాయి, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా ఐనోలు మండలం కొర్రతాండ గ్రామానికి చెందిన కేతావత్ శాంతిలుగా పోలీసులు గుర్తించారు. సదరు మహిళలను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



పట్టుబడిన మద్యం బాటిళ్లతో పోలీసులు

అభివృద్ధికి సహకరించండి

ఎన్ఆర్ఐలను కోరిన టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డి



గౌరు వెంకటరెడ్డిని సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

గడివేముల, జూలై 23: ప్రవాసాంధ్రులు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టి అభివృద్ధికి సహకరించాలని టీడీపీ సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి ఎన్ఆర్ఐలను కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా నగరంలో కర్నూలు ఎన్ఆర్ఐ ఫౌండేషన్ చైర్మన్, తానా బోర్డు సభ్యుడు పొట్లూరి రవి మంగళవారం నిర్వహించిన ప్రవాసాంధ్రుల సమావేశానికి గౌరు వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు ప్రాంతాన్ని మెగా ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నారన్నారు. హైదరాబాదు, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఓర్వకల్లు కీలకపాత్ర పోషించనుందని అన్నారు. ఎన్ఆర్ఐలు తమ నైపుణ్యం, పెట్టుబడులతో ముందుకు వచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన వారికి ఎన్డీయే ప్రభుత్వం రాయితీలు ఇస్తుందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పాణ్యం నియోజకవర్గం అన్ని విధాలా అనువైన ప్రాంతం అన్నారు. అనంతరం గౌరు వెంకటరెడ్డిని ప్రవాసాంధ్రులు ఘనంగా సత్కరించారు.

కమిటీ ఎన్నికలకు మరో మూడు నామినేషన్లు

కర్నూలు(న్యూసిటీ), జూలై 23: నగర పాలక సంస్థ సంఘ కమిటీ సభ్యుల ఎన్నికకు సంబంధించి మంగళవారం ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు, ఒక టీడీపీ కార్పొరేటర్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. నగర పాలక కార్యాలయంలో 3వ వార్డు షేక్ పర్వీన్(టీడీపీ), 31వ వార్డు మిద్దె చిట్టెమ్మ, 50 వార్డు ఎస్టీ షేక్ అహ్మద్‌లు తమ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, సీ3 క్లర్క్ శ్రీకాంత్ ఉన్నారు. ఇదిలా ఉండగా మొత్తం ఐదుగురు సభ్యులు ఉండే కమిటీలో ఒప్పందం ప్రకారం కర్నూలు నియోజకవర్గ నుంచి ముగ్గురు, పాణ్యం నియోజక వర్గం నుంచి ఇద్దరు చొప్పున ఏకగ్రీవం చేసుకునే పద్ధతి కొనసాగేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో లెక్క తప్పుతున్నట్లుంది. పాణ్యం నియోజకవర్గం నుంచి మిద్దె చిట్టెమ్మను బలపరుస్తూ మిగతా కార్పొరేటర్లుందరూ సిద్ధమయ్యారు. మరొకరికి అవకాశం ఉన్నా ఎవరూ ముందుకు రాకపోవడంతో కోడుమూరు నియోజకవర్గం నుంచి 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డికి అవకాశం వచ్చినట్లయింది. అయితే కర్నూలు నియోజకవర్గంలో మాత్రం ఇప్పటికే వైసీపీ నుంచి ఐదుగురు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల స్వీకరణ ముగుస్తుంది. అనంతరం అభ్యర్థుల జాబితాను విడుదల, గురువారం నామినేషన్ల పరిశీలన జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు

నంద్యాల క్రైం, జూలై 23 : నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధుల్లో నాటుసారా స్థావరాలపై మంగళవారం పోలీసులు విస్తృతదాడులు చేశారు. ఇందులో పది లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, రెండు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి 16కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 16 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మనాయుడిపేట గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నారనే సమాచారంతో సీఐ గోపినాథ్ ఆధ్వర్యంలో దాడులు చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12,430 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రజలు నమ్మడం లేదనే ఢిల్లీకి జగన్

నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూలై 23: వినుకొండలో జరిగిన ఘటనపై ప్రజలు నమ్మకపోవడంతోనే మాజీ సీఎం వైఎస్ జగన్ రూటుమార్చి నిరసన పేరుతో ఢిల్లీకి వెళ్లాడని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన హుశేనాపురం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. సీఎంగా పనిచేసిన ఐదేళ్లలో రాష్ట్రానికి నిధులు రాబట్టలేకపోయిన జగన్ ఇప్పుడు ఏవేవో మాట్లాడుతున్నాడన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన 40 రోజుల్లోనే కేంద్రం నుంచి రూ.15వేల కోట్ల తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. జగన్ ప్రభుత్వంలో హత్యలు, అక్రమ కేసులు, ఇసుక మాఫియా, టీడీపీ నాయకులపై కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. దాంతో రాష్ట్ర అభివృద్ధి 30 ఏళ్ల వెనక్కు వెళ్లిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఓర్వకల్లు-బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కృషి చేస్తామని కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ పేర్కొనడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు పురపాలక మంత్రితో సమీక్ష

కర్నూలు(న్యూసిటీ), జూలై 23: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారా యణతో గురువారం పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు టౌన్‌ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ విద్యులత బుధవారం తెలిపారు. పట్టణ ప్రణాళికా విభాగం శాఖలో జరుగుతున్న పనులు, వివిధ రకాల పన్ను వసూళ్ల తదిరత అంశాలపై సమీక్షించనున్నట్లు తెలుస్తోంది. నగర పాలక సంస్థ కార్యాలయంలోని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో విజయవాడకు తరలివెళ్లారు.

వర్షాకాలంలో విద్యుత్ అంతరాయంపై జాగ్రత్త

విద్యుత్ శాఖ ఎస్ ఈ ఉమాపతి

ఆదోని, జూలై 23: వర్షాకాలం విద్యుత్ అంతరాయంపై అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూపరిం టెండెం ట్ ఆఫ్ ఇంజనీర్ ఉమాపతి అన్నా రు. మంగళవారం డీఈ కార్యాల యంలో విద్యుత్ వాఖ అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుం డడం వల్ల అక్కడక్కడ ఈదురు గాలులకు విద్యుత్ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. వినియోగదారులు తీగలు తెగినప్పుడు వారే మరమ్మతు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. మొండిబకాయిలపై దృష్టి సారించి 100 శాతం విద్యుత్ బకాయిలు వసూలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాఘవులు డీఈ రాజేష్ పురుషోత్తం కాజా ఏఈలు నాగభూషణం సంతోష్ నరసన్న పాల్గొన్నారు.

నేడు శ్రావణ మాస ఉత్సవాలపై సమీక్ష

కౌతాళం, జూలై 23: ఉరుకుంద గ్రామంలోని ఈరన్న స్వామి ఆలయంలో జరిగే శ్రావణ మాసపు ఉత్సవాలపై సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వెంకటేష్ తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్వామివారి శ్రావణ మాసపు ఉత్సవాలు నెల రోజుల పాటు జరుగుతాయని అన్నారు. వీటి ఏర్పాట్లలో భాగంగా జరుగుతున్న సమీక్ష సమావేశానికి ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ముఖ్య అతిథిగా హాజరైతున్నట్లు తెలిపారు.

లారీ బోల్తా : ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్



బోల్తాపడిన లారీ నుంచి బయటకు వస్తున్న డ్రైవర్ లక్ష్మీకాంతరెడ్డి

సి. బెళగల్, జూలై 23: కర్నూలు నుంచి యూరియా లోడ్‌తో సి. బెళగల్‌కు ఏపీ 21 టి 6111 నెంబర్ గల లారీ బయల్దేరింది. ఈ లారీని డెబ్బయి ఏళ్ల లక్ష్మీకాంతరెడ్డి నడుపుతున్నాడు. సి. బెళగల్ నుంచి కర్నూలుకు వెళ్తున్న మోటార్ సైకిల్ ఎదురుగా రావడంతో దానిని తప్పించబోయి లారీ అదుపు తప్పి గోతిలో పడింది. అయితే లారీ డ్రైవర్ లక్ష్మీకాంతరెడ్డి లారీలో నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. కర్నూలు పట్టణంలోని వాసవి నగర్‌కు చెందిన లక్ష్మీకాంతరెడ్డికి 10 సంవత్సరాల క్రితం భార్య మృతి చెందింది. ఉన్న ఒక్క కుమారుడు పట్టించుకోక్కపోవడంతో కర్నూలు పట్టణానికి చెందిన శ్రీనివాసయాదవ్ దగ్గర లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన 40 సంవత్సరాలుగా ఇదే పనిలో ఉన్నాడు. ఎస్ఐ తిమ్మారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్‌కు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించారు. అయితే లక్ష్మీకాంతరెడ్డికి చిన్నగాయం కూడా కాకపోవడంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు.

విద్యుత్ ప్రమాదంలో ఆస్తి నష్టం

మద్దికెర, జూలై 23: మండలంలోని హంపా గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం గాలికి విద్యుత్ కేవీ-11 విద్యుత్ తీగ తెగి పడి ఆస్తి నష్టం జరిగింది. హంపా గ్రామం నుంచి బొమ్మనపల్లికి విద్యుత్ సరఫరా చేసే కేవీ-11 తీగ ఎస్సీ కాలనీ సమీపంలోని ఇంటి పైన పడిపోవడంతో కాలనీలోని హుశేన్, చంద్రప్ప, మల్లేష్, రామాంజి, రవి, యోహానయ్య మరి కొంత మంది ఇండ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లు, వైర్లు కాలిపోయాయి. ఇండ్లలో వాళ్లు వ్యవసాయ పనులకు, పిల్లలు పాఠశాలలకు వెళ్లడంతో ప్రాణ నష్టం జరగలేదని కాలనీవాసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 23: ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడివెళ్ల గ్రామానికి చెందిన లింగప్ప(38) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. లింగప్ప కుటుంబ సమస్యలతో జీవితం మీద విరక్తి చెంది తొమ్మిది రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. లింగప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు,

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

పాణ్యం, జూలై 23: మండలంలోని ఆలమూరు గ్రామంలో కౌలు రైతు ఉప్పరి నాగప్ప (65) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మంగళవారం తన కౌలు పొలంలో గడ్డి కోస్తుండగా గడ్డిలో ఉన్న విద్యుత్ తీగను కొడవలితో పొరపాటున కోయడంతో విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు.

సచివాలయ సిబ్బంది తీరు మార్చుకోవాలి

నందవరం, జూలై 23: గ్రామ సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని, తీరు మార్చుకోవాలని తహసీల్దారు, ప్రత్యేక అధికారి ఓబులేసు హెచ్చరించారు. మంగళవారం నాగలదిన్నె గ్రామాల్ని విజిట్ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిసినా అధికారుల ఇంత నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, డ్రైనేజీల్లో మురుగు కనిపిస్తుందని మండిపడ్డారు. తాగునీటి ట్యాంకుల వద్ద శుభ్రంగా ఉంచాలని, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.

రైతుల ప్రయోజనాల కోసమే పూడికతీత: టీడీపీ

నందవరం, జూలై 23: రైతుల ప్రయోజనాల కోసమే హాలహర్వి దేశాయి చెరువులో పూడికతీత పనులు చేపట్టామని టీడీపీ సీనియర్ నాయకులు, రైస్‌మిల్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సర్వేనంబర్ 601లో 193 ఎకరాల విస్తీరణంలో ఈ చెరువు ఉందని, చెరువు నిండితే హాలహర్వితో పాటు, బాపురం, ధర్మాపురం, జగ్గాపురం, ముగతి గ్రామాల రైతులకు సాగు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు.

ఆధార్ సేవలు ప్రారంభం


ఎంపీడీవో కార్యాలయంలో చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

హొళగుంద, జూలై 23: హొళగుంద ఎంపీడీవో కార్యాలయంతో పాటు, సచివాలయం మూడుతో పాటు చిన్నహ్యాట గ్రామంలోని సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభించినట్లు ఎంపీడీవో ఆజాద్ మంగళవారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలోని ఆధార్ కేంద్రానికి, మార్లమాడికి, కోగిలతోట, సులవాయి, వందవాగలి గ్రామ ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని, అలాగే మూడవ సచివాలయానికి సంబంధించి హొళగుంద గ్రామస్తులు సంప్రదించి ఆధార్ దరఖాస్తు నమోదు చేసుకోవాలని అన్నారు. అలాగే చిన్నహ్యాట సచివాలయానికి సంబంధించి ఎల్లార్తి, నేరణికి, చిన్నహ్యాట గ్రామ ప్రజలు సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 22వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు.

ఐటీఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు , జూలై 23: ఎమ్మిగనూరులో ఉన్న నీలకంఠేశ్వర ఐటీఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ నాయకులు రాజు, ఎలియా, భాస్కర్, ఉరుకుంద అధికారులను కోరారు. మంగళవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు లేకుండా కళాశాలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రాక్టికల్స్ పేరుతో పేద విద్యార్థుల నుండి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. అధికారులు స్పందించి కళాశాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు.

భవన కార్మికుల కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కార్మికులు

మద్దికెర, జూలై 23: మద్దికెర గ్రామంలోని చర్చి వీధిలో నివసించే భవన కార్మికుడు కొత్త కురువ నాగరాజు, బోయ వెంకట్రాముడు ఇరువురు భవన కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. అకాల మరణం చెందడంతో తోటి కార్మికులు నాగరాజు కుటుంబానికి రూ.60వేలు, వెంకట్రాముడు కుటుంబానికి రూ.15వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం మద్దికెర భవన కార్మికులు అందజేశారు.

పశువులకు టీకాలు వేయించాలి

మద్దికెర, జూలై 23: మండలంలోని రైతులు పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేయించాలని, వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ రవిప్రకాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎడవలి గ్రామంలో 62 ఆవులకు, ఎద్దులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే రైతులకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు కృష్ణనాయక్, వెంకటేశ్, అరుణ కుమారి తదితరులు ఉన్నారు.

'ప్రత్యేక హోదాపై మాట్లాడకపోవడం దారుణం'

ఎమ్మిగనూరు రూరల్, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశం మాట్లాడకపోవడం దారుణమని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో తిరుపతిలో జరిగిన సభలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఏపీకి ఐదేళ్లు కాదు పదేళ్ల పాటు ప్రత్యేక హోదా కల్పిస్తామన్నారన్నారు. విద్యారంగంలోను బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యతను ఇవ్వలేదన్నారు. విభజన హామీలు, కడప స్టీల్ ప్లాంట్, రైల్వేజోన్లపై ప్రస్తావించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. విభజన చట్టంలోని హామీలు, విద్య, నిరుద్యోగ యువతకు ఈ బడ్జెట్‌లో మొండిచేయి చూపారని అన్నారు.

వందశాతం రేషన్ పంపిణీకి చర్యలు


తెర్నేకల్‌లో బాలిక హాస్టల్‌ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

దేవనకొండ, జూలై 23 : గ్రామాలలోని ప్రజలకు వందశాతం రేషన్ పంపిణీ అయ్యేలా చుస్తామని పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి అన్నారు.మంగళవారం తెర్నేకల్ గ్రామంలో పర్యటించారు.రేషన్ దుకాణాలను తనిఖీ చేసి స్టాకు వివరాలను డీలర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న బాలికల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. హాస్టల్‌లో బాత్‌రూములు మరమ్మతులకు గురికావడంతో సంక్షేమశాఖ అధికారుల దృష్టికి తెలియజేస్తామన్నారు. తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, డీటీ వెంకటేష్, వీఆర్వోలు జాకీర్ ,షేక్ మునీర్ తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

దేవనకొండ ,జూలై 23 : ఆలూరు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు విభేదాలు పక్కనపెట్టి సమన్వయంతో పనిచేయాలని కర్నూలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి గుండ్లకొండ రాందాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపోటములు సహజమని, పార్టీలోని కార్యకర్తలను కాపాడుకోవడమే ముఖ్యమన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ఆరాచకాలకు నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలు ఇబ్బందిపడ్డారాన్నరు.

వృద్ధుడి అదృశ్యం : కేసు నమోదు

మంత్రాలయం, జూలై 23. మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన బోయ నరసన్న(74) అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈనెల 1వ తేదీన ఫించన్ తీసుకున్నప్పటి నుంచి కనిపించటం లేదని కొడుకు బోయ నీలకంఠ మంత్రాలయం పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. గత 22 రోజులుగా బంధువుల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవటంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీనాథ్ తెలిపారు.

యువకుడు మృతి

వెల్దుర్తి, జూలై, 23: పట్టణానికి చెందిన యువకుడు మధుకర్ తొగర్చేడు రోడ్డు సమీపంలో అనుమానాస్పద స్థితిలో చనిపోయిన ఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. వెల్దుర్తి కొండపేటకు చెందిన మధుశేఖర్ సోమవారం రాత్రి ద్విచక్రవాహనంలో స్నేహితుడిని క్రిష్ణగిరి మండలం తొగర్చేడు గ్రామంలో విడిచిపెట్టి వెల్దుర్తికి తిరుగు ప్రయాణమయ్యాడు. పట్టణ సమీపాన హైవేలో ఉన్న మద్యం దుకాణం దగ్గర ఉదయం విగతజీవిగా పడిఉన్నాడని కూరగాయల ఆటోల వారు మంగళవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తండ్రి పెద్దరాముడు ఫిర్యాదు మేరకు వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండమ్మ కుటుంబానికి భద్రత కల్పిస్తాం

- నాగనాథనహళ్ళిలో సబ్ కలెక్టర్, డీఎస్పీ పర్యటన


గుండమ్మ కుటుంబంతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, డీఎస్పీ

ఆదోని రూరల్, జూలై 23 : ఆదోని మండలం నాగనాథనహళ్ళి గ్రామానికి చెందిన దళిత గుండమ్మ కుటుంబానికి భద్రత కల్పిస్తామని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఎస్పీ శివ నారాయణ స్వామి పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీన భూ తగాదాల్లో భాగంగా, రియల్ ఎస్టేట్ వ్యాపారి దళిత గుండమ్మను ప్రత్యర్థులు రాఘవరెడ్డి, శ్రీధర్‌రెడ్డిలతోపాటు మరో నలుగురు దారుణంగా ట్రాక్టర్‌తో ఢీకొట్టి హతమార్చారు. దీంతో నాటి నుండి గ్రామంలో శాంతిభద్రతల్లో భాగంగా, పికెటింగ్ కొనసాగుతోంది. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డిఎస్పీ శివ నారాయణ స్వామిలు వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి గుండమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి గుండమ్మ కుటుంబానికి రావాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరితగతిన వచ్చేలా చర్యలు చేపట్టామని, అంతేకాకుండా ఆమె కుటుంబానికి ఎల్లవేళలా భద్రత కల్పించనున్నారు. వీరి వెంట రూరల్ సిఐ నీరంజన్‌రెడ్డి,తహసీల్దార్ హసీనా సుల్తానా, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, ఉప తహసీల్దార్ వలిబాషా, ఆర్ఐ కాశీంలు ఉన్నారు.

● ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ తెలిపారు. మంగళవారం ఆకస్మికంగా నాగనాథనహళ్ళి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న బోజనాన్ని తనిఖీ చేసి, విద్యార్థులు తింటున్న ఆహారాన్ని సబ్ కలెక్టర్ రుచి చూసి విద్యార్థులతో ముచ్చటించారు.

ఆదోని: పట్టణంలోని పౌరసరఫరాల గోదాం పాయింటును మంగళవారం సబ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డుల్లో ఉన్న దానికి గోదాంలో ఉన్న బియ్యం సంచులు కరెక్ట్‌గా ఉన్నాయా లేదా అన్నది పరిశీలించారు. అనంతరం రికార్డులను చూశారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ హసీనా సుల్తానా, ఉప తహసీల్దార్ వలి బాషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాసిం పాల్గొన్నారు.

కౌలు రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోండి

హొళగుంద, జూలై 23: మండలంలో పొలాలను కౌలు చేస్తున్నా రైతులు కౌలు రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆనంద్, డిప్యూటీ తహసీల్దార్ నిజాముద్దీన్ మంగళవారం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ వీఆర్‌వోలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి 1360 కార్డులు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 410 మందికి కౌలు రైతు కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు తస్లీమ్, సుంకమ్మ, మాణిశ్రీ, నరసింహ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి


మాట్లాడుతున్న సీఐ

పత్తికొండ టౌన్, జూలై 23: తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, చెడు వ్యసనాల బారిన పడకుండా క్రమశిక్షణతో చదివి మంచి ప్రయోజకులుగా ఎదగాలని పత్తికొండ అర్బన్ సీఐ మురళీమోహన్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం దేవనబండ గ్రామ హైస్కూల్‌లో విద్యార్థులకు ర్యాగింగ్‌పై, అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం స్వామన్న అధ్యక్షత వహించారు.

పులికనుమ చేపల వేలం పాట వాయిదా


వేలం పాట వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న అధికారి

కోసిగి, జూలై 23: పులికనుమ ప్రాజెక్టులో చేపల వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం కోసిగిలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పులికనుమ ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు చేపల వేలం పాటను నిర్వహించారు. అయితే వేలంపాటదారులు పెద్ద ఎత్తున చేరుకుని వేలంలో వాగ్వావాదానికి చేరుకోవడంతో ఆ వేలం పాటను జిల్లా అధికారుల ఆదేశాలతో ప్రస్తుతం వాయిదా వేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఎస్ఐ సతీష్ కుమార్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పీఆర్సీ అందించాలి : డీటీఎఫ్

కోసిగి, జూలై 23: నూతన ప్రభుత్వంపై ఉపాధ్యాయ, ఉద్యోగులు పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా పీఆర్సీని అమలు చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకట్రాముడు డిమాండ్ చేశారు. పే రివిజన్ ఆలస్యమయ్యే సందర్భంలో ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతని వెంటనే ప్రకటించి అమలు చేయాలన్నారు. చిన్నభూంపల్లి, పెద్దబూంపల్లి, ఐరంగల్, జంపాపురం పాఠశాలలను సందర్శించి డీటీఎఫ్ సభ్యత్వ నమోదులు చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు రామన్న, గంగాధర్, సదానందం, గోట్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'రిజర్వాయర్లను నీటిని విడుదల చేయాలి'

కోసిగి, జూలై 23: మండలంలో ఉన్న గురు రాఘవేంద్ర ప్రాజక్టు, పులికనుమ రిజర్వాయరులకు తుంగభద్ర నీటితో పంపింగ్ చేయాలని కోసిగి మేజర్ గ్రామ సర్పంచ్ కుమారి ఎస్.అయ్యమ్మ అధికారులను కోరారు. మంగళశారం సర్పంచ్ అయ్యమ్మ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు వరద నీటిని విడుదల చేశారని, ఆ నీటిని రిజర్వాయర్లకు వదలాలని సర్పంచ్ కోరారు.

'రాష్ట్రపతి పాలన కోరడం అవివేకం'

తుగ్గలి, జూలై 23: కూటమి ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులు గడవకముందే రాష్ట్రపతి పాలన కావాలని వైసీపీ కోరడం అవివేకమని, టీడీపీ మండల అధ్యక్ష ఉపాధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి, వీరశైవ లింగాయత్ రాష్ట్ర నాయకులు బాల కౌశిక్ కుమార్ మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ఏర్పడి గత ప్రభుత్వం చేపట్టిన భ్రష్టు వ్యవస్థను టీడీపీ ప్రభుత్వం చక్కదిద్దుతున్న నేపథ్యంలో వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ రాష్ట్రపతి పాలన కోరడం ఏంటని, గత ఐదేళ్లలో అద్దాల మేడలో ఉంటూ వైసీపీ చేపడుతున్న అరాచకాలను చోద్యం చూస్తూ ఉండిపోయారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. రాబోవు రోజుల్లో జగన్ అక్రమాలకు జైలుకు వెళ్లడం తథ్యమని అన్నారు.

పండ్ల తోటలతో అభివృద్ధి


రైతులకు మొక్కలను అందిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు

తుగ్గలి, జూలై 23: రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ కింద పండ్ల మొక్కలను అందిస్తుందని, పండ్ల తోటల పెంపకాలతో రైతులు అభివృద్ధి చెందుతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. మంగళవారం రామలింగాయపల్లె, మామళ్లకుంట, తదితర గ్రామాల్లో ప్రభుత్వం అందిస్తున్న పండ్ల మొక్కలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో టీఏ ప్రదీప్, దేవేంద్ర, మల్లికార్జున, చంద్ర ఉన్నారు.

విద్యార్థినులకు నగదు బహుమతి


విద్యార్థినికి నగదు అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం, జూలై 23: మంత్రాలయం మండలంలోని చిలకలడోణ గ్రామంలో కస్తూరి బా గాంధి పాఠశాలలో 2023-2024 ఏడాదిలో 10 వ తరగతిలో ప్రథమ,ద్వితీయ స్థానాల్లో మార్కులు సాధించిన సీ ధరణి శ్రీ,వి ఇందులకు నగదు బహుమతులను అందచేశారు. మంగళవారం ప్రిన్సిపాల్ శాంతి ఆధ్వర్యంలో గుర్రెడ్డి భీమిరెడ్డి, మంత్రాలయం సర్పంచి తెల్లబండ్ల భీమయ్య లు ప్రథమ బహుమతి రూ.3 వేలు, ద్వితీయ బహుమతి రూ.2 వేలు నగదును అందచేశారు. వచ్చే ఏడాది అధిక మార్కులు సాధించిన విద్యార్థినీలకు రూ. 5 వేలు నగదు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీకేసీ రాఘవేంద్ర ఆచారి, వెంకటేష్, ఉపాధ్యాయులు రామకృష్ణవేణి.అనసూయ, భ్రమరాంబ, సునీత, జరీన, రమాదేవి, ఇందిర, లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవు


చెట్నహల్లిలో మురుగు కాలువలను పరిశీలిస్తున్న తహసీల్దార్

తుగ్గలి, జూలై 23: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని తహసీల్దార్ షర్మిల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎద్దుల దొడ్డిలో పారిశుధ్య పనులు పరిశీలించి సచివాలయం తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడుతూ ప్రతి వారం గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఈమె వెంట ఆర్ఐ సుధాకర్ రెడ్డి, వీఆర్వో కాశీ రంగస్వామి తదితరులు ఉన్నారు.

మంత్రాలయం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీటి సమస్య ఏర్పడితే ఆయా శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి తెలిపారు. మంగళవారం మండలంలోని చెట్నహల్లి గ్రామాన్ని సందర్శించారు. రోడ్లపైనే చెత్తదిబ్బలు నిల్వ చేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, వాటిని తొలగించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్పంచ్ బెస్త ఆంజనేయులు, ఎంపీటీసీ వీరాంజనేయులు, వీఆర్వో భీముడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చిన్న రంగమ్మ, పద్మ, శ్రీరాములు, మల్లేష్ పాల్గొన్నారు.

అమరావతికి నిధుల ప్రకటించడంతో హర్షం

ఆస్పరి, జూలై 23: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి అత్యధిక నిధులు కేటాయించడంపై టీడీపీ మాజీ మండల కన్వీనర్ తిమ్మన్న, సతీష్ కుమార్, ఎస్ మహేష్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు సమర్థతతోనే కేంద్రం ఈ విధులు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వర్, నాగన్న, తాయన్న, శంకర్, తెలుగు యువత నాయకుడు మారేష్, ఓబులేష్, సాగర్, పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఫిర్యాదు

ఆదోని రూరల్, జూలై 23 : తన భర్త అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని బసరకోడుకు చెందిన మహిళ స్వాతి తాలుక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన స్వాతికి 3 మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన సోమశేఖర్‌తో వివాహం జరిగింది. పెళ్లి సమయింలో కట్నం కింద స్వాతి కుటుంబ సభ్యులు సోమశేఖర్‌కు 8తులాల బంగారం, రూ.3లక్షలు అందించారు. అయితే మరో రూ.5లక్షలు కట్నం కింద తీసుకరావాలని స్వాతిని ఆమె భర్త సోమశేఖర్, రాము, పద్మ, లక్ష్మీదేవిలు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందని, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎర్రిస్వామి ఎస్ఐ తెలిపారు.

ముగ్గురు అరెస్టు

ఆదోని మండలం బైచిగేరి గ్రామానికి చెందిన తాయన్న, ఈరన్న, హనుమంతులను పోలీసులు అరెస్టు చేశారు. గ్రామ శివార్లలో మద్యం తరలిస్తుండగా, మంగళవారం అదుపులో తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కోసిగి, జూలై 23: మండల పరిధిలోని దుద్ది గ్రామంలో కుష్ఠు వ్యాధిపై విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్యసిబ్బందితో పాటు ఎంఈవో నాగేశప్ప పాల్గొన్నారు. కుష్ఠు వ్యాధి ఎండీటీ బహుల ఔషధ చికిత్స ద్వారా పూర్తిగా నయం అవుతుందని, క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలన్నారు.

గుర్తు తెలియని సాధువు మృతి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 23: ఎమ్మిగనూరులోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో మంగళవారం గుర్తుతెలియని సాధువు(70)మృతిచెందాడు. కాలుకు గాయమై అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ వస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం ఆసుపత్రి ఆవరణలో రాత్రిపడుకున్నాడు. మంగళవారం ఉదయం సాదువు మృతిచెందినట్లు స్థానికులు గుర్తించి ఆసుపత్రి సిబ్బందికి తెలిపారు. దీంతో వారు పరిరించి చూశారు. మృతిచెందినట్లు గుర్తించారు. అయితే సాధువు ఎవరు, ఆయన ఎక్కడనుంచి వచ్చాడో తెలియదని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కొనసాగించాలి


సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 23: పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఉన్నచోటనే కొనసాగించాలని విద్యార్థి సంఘం నాయకులు షాబీర్ భాష, లింగప్ప కోరారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గత 30 ఏళ్ళ నుంచి విద్యార్థి సంఘాల పోరాటాల వల్ల సాధించుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల గత ఏడాది తరగతులు ప్రారంభించారన్నారు. ప్రస్తుతం తాత్కాలిక భవనమైన ఎయిడెడ్ వైయంకే ఉన్నత పాఠశాలలో కొనసాగుతుందని అన్నారు. ప్రైవేటు కళాశాలల ఒత్తిడి వల్ల అక్కడ నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆరెకలు గ్రామంలోని ప్రభుత్వ మైనార్టీ ఐటీ కళాశాల ఖాళీ భవనంలోకి మారుస్తామని చెప్పడం సరైనది కాదన్నారు. కళాశాలను అక్కడికి మారిస్తే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బాలికలకు రాకపోకలకు ఇబ్బంది పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యార్థినిలు మధ్యలోనే డ్రాప్ అయ్యే అవకాశం ఉందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అడ్మిషన్లు సంఖ్య 150 వరకు పెరిగాయని అన్నారు. విద్యార్థులు దూరమైందని వెబ్ ఆప్షన్‌లో కళాశాల మార్చుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, శివ, లక్ష్మి, రామకృష్ణ, చరణ్, నాగరాజు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధులకు ఘన నివాళి


చంద్రశేఖర్ ఆజాద్, గంగాధర తిలక్ చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 23: స్వాతంత్ర సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఆదోని గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం వారి చిత్రపటాలకు పూల మాలవేసి నివాళులు అర్పించారు. ధర్మ ప్రచారక్ నాగరాజు మాట్లాడుతూ హిందువుల ఐక్యతకై గణేష్ ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన తొలితరం భారత స్వాతంత్రోద్యమాన్ని నడిపిన మహాయోధుడు బాలగంగాధర్ తిలక్ అన్నారు. 15ఏళ్ల వయసులోనే స్వాతంత్రం కోసం పోరాడి ఆత్మార్పణ చేసిన చంద్రశేఖర్ ఆజాద్‌లను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు, చెన్న బసప్ప, భీమేష్, అర్జున్, కాలురామ్ వీరేష్ పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు నడుం బిగించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం పత్తికొండ పట్టణంలో ఏబీవీపీ నగర సమావేశం జరిగింది. ఎర్రిస్వామి మాట్లాడుతూ బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహానుభావుల స్ఫూర్తితో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగిద్దామన్నారు. అనంతరం ఏబీవీపీ పత్తికొండ నూతన నగర కార్యదర్శిగా అశోక్, సహాయ కార్యదర్శిగా దేవనాథ్, చరణ్, కళ్యాణ్ ఉన్నారు.

మార్కెట్ వేలం వాయిదా

ఆదోని టౌన్, జూలై 23: ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌తో పాటు పశువుల సంత, గొర్రెల సంత మార్కెట్ల వేలాలు ఈనెల 23న తేదీన జరగాలని, కొన్ని అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. వేలాలు నిర్వహించే తేదీను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

జగన్ మాటలు హాస్యాస్పదం

ఆదోని టౌన్, జూలై 23: ఐదేళ్ల పాటు పరదాల చాటున పర్యటనలు చేసిన జగన్ మోహన్ రెడ్డి నేడు ప్రజాస్వామ్యంపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, మైనారిటీ హక్కుల పోరాట సమితి (ఏంహెచ్‌పీయస్) రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్ విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షం హోదా కూడా లేని జగన్ అసెంబ్లీ వద్ద పోలీసులను దబాయిస్తూ చిందులు వేయడం ఆయన నిజస్వరూపానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా జగన్ ఒంటెత్తు పోకడలను వదిలేసి ప్రజాస్వామ్యబదంగా వ్యవహారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదోని ప్రెసిడెంట్ హాసన్, వైస్ ప్రెసిడెంట్ అబిద్ లీగల్ అడ్వైసర్ చాంద్ బాషా, వసీం సాహెబ్, జిలాన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభలు

దేవనకొండ, జూలై 23 : గత ఏడాది నుంచి జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామసభలు మండలంలోని తెర్నేకల్, గుండ్లకొండ, అలారుదిన్నె ,బేతపల్లి, గ్రామాలలో పంచాయతీ కార్యాయాలలో గ్రామసభలు జరిగాయి. ఎపీడీ పక్కీరప్ప, ఎపీవో కృష్ణమూర్తి సమక్షంలో ఉపాధిహామీ పనులపై గ్రామస్తుల సమక్షంలో ఏడాదిగా జరిగిన పనులపై రిసోర్స్‌పర్సన్ వివరాలు తెలియజేశారు.

గుండ్లకొండలో భారీగా అక్రమాలు: మండలంలోని గుండ్లకొండ గ్రామపంచాయతి పరిధిలో గత ఏడాది నుండి రూ.38 లక్షల నిధులకు పనులు జరిగిన్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు. కానీ మొత్తం మీద రూ.18 లక్షల పనులే జరిగాయని టీడీపీ నాయకులు రాందాస్‌గౌడ్ అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ భారీగా అవినీతి పాల్పడడం జరిగిందని, డీఆర్‌పీలు నిక్కచ్చిగా తనిఖీ చేసి అవినీతిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

రైతు ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకులు యేసేపు

ఎమ్మిగనూరు , జూలై 23: రైతుల ఆత్మహత్యల నివారణకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి యేసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కేఎండీ హనీఫ్‌లు అన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెట్టిన పెట్టుబడి చేతికందక ఆత్మహత్యలు చేసుకుంటున్నా రన్నారు. రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్, విజయ్, డేవిడ్, బాలు, అబి, అజయ్ పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో చెత్తచెదారం తొలగింపునకు చర్యలు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 23: ఎట్టకేలకు ఎల్లెల్సీలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల ఎల్లెల్సీకి తుంగభద్ర డ్యాం నుంచి ఇటీవల నీరు వదిలారు. ఈ నీరు రెండు, మూడు రోజుల్లో ఎమ్మిగనూరు పట్టణానికి చేరుకునే అవకాశం ఉంది. దీంతో మున్సిపల్ అధికారులు స్పందించి మంగళవారం ఎక్సకవేటర్‌తో కాలువలో పేరుకు పోయిన మురుగును తొలగించే పనులు చేపట్టారు. పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ గంప జాతర

ఆదోని టౌన్, జూలై 23 : పొలిమేరలలోని కొండగుహలో కొలువైన రేణుకా ఎల్లమ్మ గంప జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఎల్లమ్మ మాతకు ఆలయ పూజారులు విశేష పూజలను నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్రం నుండే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పంటసాగు పత్రాలతో కౌలు రైతులకు మేలు


కౌలు రైతులకు పంటసాగు పత్రాలను అందజేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి

గోనెగండ్ల, జూలై 23: పంట సాగు పత్రాల వలన కౌలు రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి అన్నారు. మంగళవారం తిప్పనూరు గ్రామంలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంట సాగు పత్రం భూ యజమానికి, సాగుదారుడికి మధ్య ఒప్పంద పత్రమని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు కౌలు రైతులు నష్టపోకుండా ఈ పత్రాలు మేలు చేస్తాయని అన్నారు. ఈ పత్రానికి 11 నెలలు మాత్రమే విలువ ఉంటుందని తెలిపారు. అన్నదాత, సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, పంటనష్ట పరిహారం, సున్నావడ్డీ, ధాన్యం పండించిన తరువాత కొనుగోలు కేంద్రంలో అమ్మడానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నాని వారు తెలిపారు. ఈ హక్కు పత్రాలు ఎమ్మిగనూరు మండలంలో 965 మంది కౌలు రైతులకు, నందవ రం మండలంలో 970 మందికి, గోనెగండ్ల మండలంలో 855 మందికి, మంత్రాలయం మండలంలో 810 మంది కౌలు రైతులకు ఇచ్చేందుకు వ్యవసాశాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం రైతులు సాగు చేసిన కొర్ర, పత్తి, కంది పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత, సిబ్బంది అబ్దుల్‌సత్తర్, జాకీర్ పాల్గొన్నారు.

● గ్రామంలో అంటువ్యాధులు సోకకుండా గట్టి చర్యలు తీసుకోవాలని జేడీ వరలక్ష్మి పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సూచించారు. మంగళవారం తిప్పనూరు గ్రామంలోని వీధుల్లో పర్యటించారు.

జూదరుల అరెస్టు

మంత్రాలయం, జూలై 23: మంత్రాలయం మండలంలోని తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలో అదే గ్రామానికి చెందిన బోయ నాగరాజు, బోయ బసవ అనే వ్యక్తులు మట్కా రాస్తూ, నాటుసారా విక్రయిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని వారి వద్ద ఉన్న 10 లీటర్ల నాటుసారా, మట్కా చీటీలతో పాటు రూ. 6,280 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.